'సకారి'



# చైత్రసుందరి

చిరాకుగా ఉన్నానేమో, సిల్కులాల్చీ విప్పి పక్కకు విసిరేసరికి..."ఔను, ఇంక మీకు మేం కనపడతామా?" అన్నది, ముఖంమీద పడిన లాల్చీని తొలిగిస్తూ.

ఎదుటఉన్న వ్యక్తికూడా కనిపించనంతటి గర్వం ఏంవొచ్చిందా అనుకున్నాను. ఆమె కిటికీతలుపుల కీనీడలో ఉంది. అయినా నవ్వుతూ...

"అంత మరీ కన్పించకపోవటానికి నా కళ్ళద్దాలేమయినా మారాయనుకున్నావా?" అన్నాను, నేనుకూడా పక్కనే సోఫాలో కూర్చుని.

"అద్దాలు మారకపోయినా ఫ్రేములు మారవొచ్చుగా...సరదాకూ" అన్నది. నా మాటనే సాగనిస్తూ.

"అవును నిజమే.నువ్వుచూస్తున్నప్పటి నుంచీ ఎన్నిరకాల ఫ్రేములు మార్చాననీ—అలా అడుగుతున్నావు? అంతేనా? లేక కవిత్వం ఏమయినా మాటల్లో కలుపుతున్నావా ?"

"ఏంమాట్లాడినా మాట్లాడవచ్చు!

సహవాసదోషం...ఇదివరకు మార్చక పోయినా— యెప్పుడూ ఒకలాగానే ఉంటావనే నమ్మకమేమిటి?"

"ఎప్పుడూ లేనిది — ఇంతలోనే నాయందంత అపనమ్మకం కలగటానికి కారణమేమిటో!...ఎంతసేపటికీ చదరంగపు ఎెత్తుల సమాధానాలేకాని అసలు మనస్సులోని మాటేమిటో తేల్చిచెప్పవు కదా!''

"ఆఁ అలా అంటానా నిన్ను?...ఏం లేదు......కాని ఇవాళింత ఆలస్యంగా వొచ్చావేం?"

"నాఆలస్యానికేనా యీ'హంగామా?' ఊహుఁ మనస్సులోని విషయాన్ని మాత్రం మాటుగానే వుంచి ప్రసంగం మార్చావు. అవునా?"

"నా మనస్సులో వేరే ఉన్నా లేకపోయినా, అసలు నీలోనే ఏదో అవమానం ఉన్నట్లుగా వుందే...అట్టే వేధించక వెంటనే తేల్చిచెప్పరాదూ?"

"నా అవమానం బహుశః అపోహ యేనేమో...! అపోహతో ఏమయినా తొందరపడి అంటే—నాకు నేనై అమంగళపుమాటలు మాట్లాడిన వాడనవుతానేమోనని...కాని ..."

అంటూలేచి దగ్గరనే టేబిల్‌మీది సిగరెట్ టిన్ను తీసుకొని, దానికిందనేవున్న పసుపుపచ్చ కవరుకూడా అందుకుని, "ఎప్పుడువచ్చిందీ కవరు?" అడుగుతూ నే మూత సగఁకోసి గాలివిసురుకు కవరుచించి, వుండటం గమనించి, ఉత్తరం తీసి పైపంక్తులు ఉపోద్ఘాతం చదివానో, లేదో!

"ఏం? ఇంక నేను - కనీసం-జ్ఞాపకమైనా వుంటానా?" అన్నది జాలిగా నా మెడకు చేతులు పెనవైచి.

''ఏం?"

"ఇంక నేను చెప్పేదేముందీ? చేతిలోనే వుందిగా కవరు?...అయినా నేనెందుకు మధ్యలో...?"

అంటూ చేతుల్లోంచి మెళుకువగా తప్పించుకుని,

"ఇంక వచ్చే వసంతంలో-మల్లెపూలు మచ్చుకైనా మాలాంటివాళ్ళకు దక్కనీయవుకాబోలు!..." అంటూ చెంగున దూసుకుపోయింది యింట్లోకి.

మామూలుగా సాయంకాలం బయలుదేరబోతూంటే — లోపల గుమ్మంలోనే యెదురై-

"ఈ పూట నీ కిక్కడ బందిఖానా తప్పదు. మీ అమ్మగారు చీకటిపడితేనే గాని రారు" అంటూ టీ కప్పు అంపించింది.

టీ సేవిస్తూ వుండగా—

"ఇంక బహుశః మేం ఈవూరునించి వెళ్ళిపోవాల్సి వొస్తుందేమో" అన్నది దిగులుగా.

"ఆఁ వెళ్ళిపోతావా!"అని వొడిసిపట్టుకుని,"వూఁ ఇంక ఎలా వెళ్ళిపోతావో?"

అంటూ...అంతలోనే ఆమె చేతిలో మడతపెట్టివున్న కవరు లాక్కుని, ఆ సంగతి అందులో ఏమయినా ఉన్న దేమోనని ఆదుర్దాగా చదివా.

"నువ్వు చెప్పిన సంగతి యీ ఉత్తరంలో లేదేం!...అబద్ధాలు చెప్పి నన్ను ఉడికించాలని నీకు సరదా?"

"అవును మరి. నాకు ఏ సరదా అయినా నీతోనేగా!...కాని...ఇది సరదాగా అన్నమాటకాదు. ఇన్నాళ్ళు సెలవు పెట్టారు కనుక బహుశా 'ట్రాన్స్‌ఫర్' అవుతుందేమోనని......అలాగే కనుక అయితే..." అంటూ అరచేతుల్లో ముఖం దాచుకుంది.

"ఏమిటిది? అయినప్పటి మాటకదా! అందుకోసమని ఇప్పుడిలా ముందుగానే..."

అని వోదార్చబోతూ ఆమె ముఖం పైకెత్తాను. ఆ కళ్ళల్లో - అశ్రువులుతొణికిసలాడాయి రవంతసేపు...అతి జాలిగా నా ముఖంవైపు చూస్తూ...

"అమాయకుడివి - అర్థంకాదు నీకు నా బాధ - అయినా నీ మనస్సు కూడా ..."

—చెప్పలేకపోయినా - అంతవరకు గాద్గదికంగాచెప్పి—"ఎవరో వస్తున్నట్లున్నారు!" అంటూ తప్పించుకుని వెళ్ళిపోయిందేకాని, పూర్తిగా అప్పుడూ చెప్పలా.

చెప్పలేని బాధమాత్రం పడుతోంది మనస్సులో...అయినా తొణకదు. పైగా నేనెక్కడ తన సంగతి ప్రసంగవశాత్తూ తెచ్చి - ఏవేవో కొత్త కొత్త విషయాలు ఉవ్విళ్ళూరేట్లు చెప్పి - అపూర్వమయిన అనుభవాలు నాకే కలుగబోతున్నట్లు ఆశలు కల్పించి - 'అలాంటప్పుడు నేను జ్ఞాపకమయినా వుంటానా?' అని సహజమయిన బేలతనం చూపిస్తుంది. మళ్ళీ... 'నీ ఆనందానికి విఘ్నంకాకుండా మాకు ట్రాన్స్‌ఫర్' అవటం కూడా ఒకరకంగానే మంచిదే'—ననీ సమర్థించటానికి ప్రయత్నిస్తుంది

ఆమె మాటలు వింటున్నంతసేపూ—ఏవో అపూర్వమయిన ఆనందమూ; ఉత్సాహమూ, ఉద్రేకమూ కలుగుతాయి. మళ్ళీ మధ్యలో—ఏదో తెలియనిబాధా...దిగులూకూడా...!

ఏమో! నాకు నేనే అర్థంకాని స్థితిలో వున్నా.

--మా అనుమానానికి తగినట్లుగానే ఆయనకు బదిలీ అయింది. ఇన్నాళ్ళు సెలవుపెడితే ఒకవేళ 'ట్రాన్స్‌ఫర్' కావచ్చునని తెలిసికూడా ఆయనలా ఎందుకుచేశాడా అనిపించింది. ఆయనకు ఈ వూళ్లో వుండటం ఇష్టంలేదా,...ఒకవేళ ఆమె నాతో అన్నట్లుగానే—ఈ 'ట్రాన్స్‌ఫర్' ఆమె సలహానునుసరించి చేయించుకోటానికి ప్రయత్నించ లేదుగదా!

ఆయన ముందువెళ్ళి ఆ కొత్తఊళ్ళో-ఉద్యోగంలో ప్రవేశించాడు.

ఆమె తరువాత సామానుతో కూడా వెళ్ళింది.

వెళ్లేరోజున—

"లోకం ఎన్ని మధురక్షణాలు అనుకున్నా ఇక్కడ ఉన్నన్నాళ్లూ నా జీవితంలో గడిచిపోయాయి. ఇకముందునీకు మాత్రం ఇంతకంటె మధురాతిమధురములైనక్షణాలురాబోతున్నాయి. నేనుమెల్లగా తప్పుకుంటే—నువ్వు సంపూర్ణమయిన ఆనందానుభూతిని-పొందగలవనే సంతృప్తితో-కావాలని ఇలా ట్రాన్స్ఫర్ చేయించుకోటానికి ప్రయత్నించాను. కాని ఇలా అంటే ఎవరూ నమ్మరు కదూ? నా మీది వ్యామోహంతో ఆమెనుమాత్రం అలసంగా చ డకు. ఇక దాచటమెందుకు? నీకు నేను ఇవ్వలేని - అపూర్వమయిన అనుభూతిని, ఆనందాన్ని—ఆమె ఇవ్వ కలుగుతుంది. ఆదర్శాలకోసమనికాని, అయాచితంగా వొచ్చిందేకదా అనికాని, అలసతతో ఆ అమృతాన్ని ఒలకపోసుకునేవుసుమా! నన్ను రవంత జ్ఞాపకముంచుకుంటే...నా కదే పదివేలు... ఇంక మరి శెలవా నాకు...?"

అంటూ ఆత్మవిశ్వాసంతో చేతిలో చెయ్యి వేయించుకుని...!

—ఇన్నాళ్ళూ ఆమె అనుభవించిన ఆవేదనా, బాధా—అందులో నాలుగో వంతయినా-నేను ఆమె వెళ్ళింతర్వాత కూడా అనుభవించలేకపోయాను.

అప్పుడే - ఇక్కడ వున్నప్పటికీ - అంత బాధపడిందే; ఇంక నేనసలు కనబడనుకదా ఇంకెంతబాధపడుతుందో అన్న ఆలోచనకూడా కలుగలా నాకా క్షణంలో

అవును మరి! నాకేదో పెద్ద ఆశాజ్యోతి-మసకగానైనా రవంతదూరంలో కన్పిస్తూనే వుందిగా...!

ఆ అనుభూతికోసం - నా మనస్సు రెపరెపలాడటం ప్రారంభించింది.


అంతమాత్రాన పాత వ్యామోహం మాత్రం పూర్తిగా పోయిందనా? ఎంత పాతదయినా అంత అల్పమైనదికాదు మరి...! కాగా...మనస్సు పాత-కొత్తల మధ్యలో పడి నలిగిపోతున్నది

మళ్ళీ మరో అనుమానంకూడా...

రాబోయే అమృతాన్ని ఆశించి — చేతిలో ఉన్నది అమృతం కాదనే అజ్ఞానంతోనే వొదిలివేశానేమో...! అయితే ఈ అనుమానం ఆ ఆశాజ్యోతిలో అంత లీనమయి అప్పుడు నన్నంతగా బాధించలా

ఇలా కొన్నిరోజులు మాత్రం పిచ్చి పిచ్చిగానే గడిచాయి.

ఆమె వెళ్ళిపోయిందని విన్న-ఇరుగు-పొరుగువారు మాత్రం - నేనేదో విషసర్పంనుంచి బైటపడినట్లుగా ఆనందించి....




"అవును. అభమూ శుభమూ యెరుగని—అమృతంలాంటి పిల్ల—ఆ అమాయకురాల్ని వదిలి; ఇంట్లో అద్దెకున్నారు కదా అని—ఎల్లకాలం దానితోనే పడి వుండటానికి—అతడుమాత్రం అంత అజ్ఞానుడా? ఏదో పడుచుతనంబులబాటఁ కనుక...కొన్నాళ్ళు అదోముచ్చట"... అంటూ సమర్ధించసాగారు.

—పాత సంవత్సరం వెళ్ళిపోయింది.

చైత్రంతో ప్రకృతిలో—అపూర్వమయిన శోభ–మార్పు వొస్తుంది కదూ! మరి నేనుమాత్రం ప్రకృతికి అతీతుణ్ణా? ఇంక నా ఉత్సాహానికి, ఉద్రేకానికి అవధి లేకుండా పోయింది.

మధురక్షణాల కోసం అనుక్షణాలు లెక్కించా

ఎలా అయితేయేం?

మూడురాత్రుల ముచ్చటలూ గడిచాయి.

కాని ఎలా గడిచాయి?

తిరిగి వొచ్చాను...

కళ్ళు తెరచాను...

నా కొత్తఫ్రేములోనుంచి అంతా వింతగానే కన్పిస్తోంది.

కొత్త...అనుభూతి...

మధుర ... మధురాతి మధుర... మయిన క్షణాలు...

ఈ అనుభూతి–ఈ మధురత్వం–నా మాటల్లోనూ–ఊహల్లోనూ తప్ప! మరి మచ్చునకైనా కన్పించలా...

మార్పు అయితే కన్పిస్తున్నది. కాని అనుకొనని మార్పు.

అది చైత్రమని నేను భ్రాంతి పడ్డానేమో!...

లేకపోతే పచ్చని ఆకయినా కన్పించని ఆ చిచ్చుల పిడుగుల ఎండలేమిటి——?

శరీరమంతా సెగలూ-పొగలూ…

మల్లెపూవు తగిలినా మాడిపోతున్నది. .

ఏమిటో!…

వెనుక ఆమె చెప్పిన - ప్రతి అక్షరమూ జ్ఞప్తికి వొచ్చింది. ఆమెతో గడిపిన ప్రతి ఘడియమాత్రం ఎలా జ్ఞప్తికి రాకుండా వుంటుంది? ..

వృథా ఆశలు కల్పించి - ఆమె అన్యాయంచేసి వెళ్ళిపోయిందా.. ?

ఆమె దగ్గరవున్న అతిచనువు మూలంగా అలా అనుకుంటున్నా. కాని నిజానికి ఆమె యేంచేసింది…?

ప్రకృతిలోని సహజత్వాన్ని చెప్పింది కాని ఈ వైపరీత్యం, పాపం! ఆమె మాత్రం ఊహించిందా?

అనుభవంలోకి వొస్తున్నా క్రమక్రమంగా ఆమాత్రం ఊహించుకోలేనూ..! ఊహించేదేమిటి? ప్రత్యక్షంగా కన్పిస్తూంటే.

ఈ నా స్థితి ఆమెకు తెలిస్తే?…

ఏమవుతుందో వూహించగలను. కాని ఇది విన్నమీదట ఆమెస్థితి మళ్ళా తలుచుకుని మనస్సుమాత్రం ఆపుకోలేనేమో—!

అవునుమరి…ఎంత ఇదయినా నా మనస్సుమాత్రం మరీ అంత పాషాణమా?

ఇంక అలాంటి ఆలోచనలు ఎన్నైనా కలుగుతాయి. నాకేకాదు. అలాంటప్పుడు సాధారణంగా ఎవరికైనా అంతేనేమో…!

మానసికబాధకు మందనేది యెటూ లేదు

శారీరకబాధఅయినా తగ్గించుకుందామని- ఇహ తప్పనిసరిగా-అభిమానాన్ని వదలి-డాక్టరుదగ్గరకు వెళ్ళాను.

మూడురాత్రుల ముచ్చటలకు ఫలితంగా 'సాల్వర్సన్' నరాల్లోకి గ్రుచ్చుతూ గింగురుమనేట్లు ప్రశ్నిస్తున్నాడు డాక్టరు -"ఎవరు నాయనా ఆ మహాయిల్లాలు?"

